


## సోదరుడికి రాఖీ కట్టిన ఉపేంద్ర

**దశ, ఓయూ:** బీజేపీ నాయకులు మల్లికంటి వీరన్నకు ఆయన సోదరి ఉపేంద్ర రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే చెన్నై నుంచి వచ్చిన ఉపేంద్ర తన సోదరుడికి రాఖీ కట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ వేడుకను కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించారు.



## పజ్జన్నకు పసందైన రాఖీ

❖ఎమ్మెల్యే పద్మారావుకు రాఖీ కట్టిన మహిళా నాయకురాలు స్టాలీన్ కృష్ణవేణి

**దశ, ఓయూ:** బిఆర్ఎస్ సికింద్రాబాద్ మహిళా ఇంచార్జి స్టాలీన్ కృష్ణవేణి శుక్రవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. తను సొంతగా పద్మారావు ఫోటోతో తయారు చేసిన రాఖీని పద్మారావుకు కట్టి తన సోదర భావాన్ని చాటారు. ఆయనకు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పద్మారావు కృష్ణవేణిని ప్రత్యేకంగా అభినందించి ఆశీస్సులు అందజేశారు.



## రాఖీ బంధం మరింత బలపడాలి: చిలుక మధుసూదన్‌రెడ్డి

**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** రాఖీ పండుగ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డికి ఆయన సోదరీమణులు మమతారెడ్డి, రూపారెడ్డి శుక్రవారం రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్నా చెల్లెళ్ల ఆత్మీయతకు, అక్కా తమ్ముళ్ల ప్రేమానురాగాలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ఆడపడుచులందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.





## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాఖీ కట్టిన బండ కార్తీక చంద్రారెడ్డి

**దశ, ఓయూ:** రక్షాబంధన్ పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి రాఖీ కట్టారు. కిషన్ రెడ్డి నివాసంలో ఆయనను కలిసి చేతికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావుకు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ లకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు ఆమెకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందజేశారు.



రాఖీ పండుగ సంబరాలను శుక్రవారం వనస్థలిపురంలోని పునర్జన్మ రిహాబిలిటేషన్ డి-అడిక్షన్ సెంటర్ నిర్వాహకులు యాట వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోదర-సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగను నిర్వహించి, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కుటుంబ సభ్యులు, సెంటర్ నిర్వాహకులు పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. – (దశ, నల్గొండ)

## పోతగాని గోపాల్ గౌడ్ కు రాఖీ కట్టిన మహిళా నేతలు



**దశ ఓయూ:** రాఖీ పౌర్ణమి సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఇంటి వద్ద సందడి నెలకొంది. ఆయన సోదరీమణులతో పాటు ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ మహిళా నేతలు ఇంటికి చేరుకుని గోపాల్ గౌడ్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. "నేను మీకు రక్ష.. మీరు నాకు రక్ష.. మనందరం దేశానికి రక్ష" అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ, ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో మహిళా నేతలు మంజుల వాణి, సబితా యాదవ్, జ్యోతి, విజేత, మమత, లావణ్య, అనితతో పాటు పలువురు సోదరీమణులు పాల్గొన్నారు.



## నాచారంలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

**దశ, ఓయూ:** నాచారం కొన్నే ఇంద్రమ్మ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సోదర-సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.





## పీహెచ్‌డీ స్కాలర్ కిరణ్మయి నివాసంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**దశ, ఓయూ:** పీహెచ్‌డీ స్కాలర్ కిరణ్మయి నివాసంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని సోదర-సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలిపారు. సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం పరస్పరం మిఠాయిలు పంచుకుని వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.





# ఆధార్ సేవా కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

❖ *జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్*



**దశ సూర్యాపేట ప్రతినిధి :** జిల్లాలో ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు కావడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డిమార్ట్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్ సేవా కేంద్రానికి ప్రజల నుంచి వచ్చే సమస్యలు, ఫిర్యాదులను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆధార్ కు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, వారికి అవసరమైన సేవలను సత్వరమే అందించేలా జిల్లా యంత్రాంగం తరఫున సమన్వయం చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఆధార్ సేవా కేంద్రం ద్వారా అందించే సేవలను ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన నాణ్యమైన ఆధార్ సేవలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావడంలో జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఆధార్ సేవా కేంద్రం ప్రతినిధులు ముందుకు వచ్చి జిల్లాలో సేవలు అందించేందుకు సహకరించడం అభినందనీయమని, వారికి జిల్లా యంత్రాంగం తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు.

కేంద్రం ఇన్‌చార్జీలు, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రజలకు 24 గంటలు, వారంలో ఏడు రోజులు, ఆదివారాల్లో సైతం అందుబాటులో ఉంటామని హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలను అందించాలని కేంద్రం ఇన్‌చార్జులు, సిబ్బందిని కోరారు.ఆధార్ సేవలకు సంబంధించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటిని గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఈవైడీఐ డిప్యూటీ డైరెక్టర్ నాయిని రంగనాథ్ రెడ్డి, ఇన్‌చార్జ్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, ఏడీఎం గఫార్, ఆపరేషన్ మేనేజర్ లాలు తదితరులు పాల్గొన్నారు.



## సర్వేలు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా వీరమల్ల వినోద్ ఏకగ్రీవ ఎన్నిక

**దశ, నారాయణపురం:** నారాయణపురం మండలం సర్వేలు గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా వీరమల్ల వినోద్ కుమార్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సర్వేలు సర్పంచ్ చిలకరాజు చందన రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో వినోద్‌ను గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అదేవిధంగా యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా పబ్బతి ఆకాష్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ దేవాలయ చైర్మన్లు, వార్డు సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆశీస్సులతో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన సర్వేలు గ్రామ కాంగ్రెస్ పార్టీ పెద్దలు, నాయకులు, యువతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



❖ *శ్రీ సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న పటేల్ రమేష్ రెడ్డి*

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడంతో పాటు సోదరభావం, మానవతా విలువలను కాపాడుకోవాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులు సూర్యాపేట ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజల కుటుంబాలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కౌన్సిలర్ వెలుగు వెంకన్న, ధరావత్ వెంకన్న, అరవింద్ రెడ్డి, వల్దస్ దేవేందర్, మెగ్య తండ సర్పంచ్ భూక్య రాజు నాయక్, తండు శ్రీను, యాట ఉపేందర్, శ్రీకాంత్, ధర్మ నాయక్, రాజు, దేవాలయ గౌరవ అధ్యక్షులు నూక వెంకటేశం గుప్త, అధ్యక్షులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బా ప్రకాశరావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్, నరేంద్రుని విద్యాసాగర్ రావు, సోమ శ్రీశైలం బెలిదే అశోక్, తాళ్లపల్లి రామయ్య, బ్రాహ్మణపల్లి బాల చంద్రుడు, ముదిరెడ్డి లింగ రెడ్డి బ్రాహ్మణపల్లి శివప్రసాద్ , దేవర శెట్టి సోమయ్య, వందనపు వెంకటేశ్వర్లు నూకా రవి శంకర్ దేవాలయ అర్చకులు బట్టార వంశీకృష్ణ శర్మ, అశోక్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు..

## తక్కువ ధరకే నాణ్యమైన బోల్ట్ ఇట్ ఇంజిన్ ఆయిల్

*నాచారం పారిశ్రామిక వాడలో లాంఛనంగా ప్రారంభం*



**దశ, ఓయూ:** నాచారం ఇండస్ట్రీస్ ప్రాంతంలో ఈవీ జాజ్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బోల్ట్ ఇట్ ఎక్స్‌ప్రెస్' ఇంజిన్ ఆయిల్‌ను శుక్రవారం సంస్థ కార్యాలయంలో ప్రారంభించారు. టీపీసీసీ జాయింట్ కన్వీనర్ రేగులపాటి రమ్యారావు, సంస్థ చైర్మన్ అంకుల్ అగర్వాల్, రూపేష్ షా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిజన్ శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ ధరకే నాణ్యమైన ఇంజిన్ ఆయిల్ అందుబాటులోకి రావడం నగర వాహనదారులకు ప్రయోజనకరమన్నారు. ఇప్పటికే వినియోగదారుల్లో మంచి గుర్తింపు పొందిన ఈవీ జాజ్ మొబిలిటీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'బోల్ట్ ఇట్ సూపర్ యాప్' ఎంతోమందికి ఉపయోగపడుతోందని తెలిపారు.

## విశ్వనగరం కాదు.. విషాద నగరంగా మార్చారు



**దశ, ఓయూ:** హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని చెప్పిన గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నగరాన్ని విషాద నగరంగా మార్చాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. తార్నాక డివిజన్‌లో సీనియర్ నాయకులు మాదల రాధాకృష్ణ ఆధ్వర్యంలో పూర్ణచంద్రా రావు, కే నరేష్, బి. లక్ష్మి జగన్నాన్నాద్, పి. నాగరాజు, సీ.హెచ్. ఆశీర్వాద్, సి. హర్షిత్, శంకర్ చౌదరి, రవి, విశాల్, ప్రతాప్, మల్లేన్, కీర్తి రాజ్, రమేష్, సందీప్ తదితరుల తో పాటు పలువురు విద్యావంతులు, స్థానిక ప్రముఖులు బీజేపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి కాషాయ కండువాలు కప్పి ఆహ్వానించారు. జీహెచ్ఎంసీ పరిధిలో మౌలిక వసతులు సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాంచందర్‌రావు ఆరోపించారు. అధ్వాన రహదారులు, అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థతో నగర జీవనం ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు.రాబోయే మూడు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ విజయం సాధిస్తే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు మరింత పారదర్శకంగా ప్రజలకు చేరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బండ శివారెడ్డి, మాజీ డివిజన్ ఉపాధ్యక్షులు దేవా సార్, నాగేశ్వర్ రెడ్డి, సుబ్బారావు, ఆకుల శ్రీనివాస్, పోచయ్య యాదవ్, వేణు యాదవ్, శ్రీరామ్ వెంకటేష్, వీరన్న, డివిజన్ అధ్యక్షులు ఉపేందర్ యాదవ్, కరుణాకర్, నాయకులు జమ్మికుంట వేణు, శశి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలకు 'ఇందిరమ్మ టవర్స్'

**మొదటి పేజీ తరువాయి**

ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని మంత్రి తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఇంటి విలువ సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉంటుందని, ఇందులో భూమి విలువ రూ.50-60 లక్షలు, నిర్మాణ వ్యయం రూ.10-15 లక్షలు ఉంటుందని వివరించారు. ఇంత విలువైన ఇంటిని పేద కుటుంబాలకు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వం అందిస్తోందన్నారు. లబ్ధిదారుల కుటుంబంలోని మహిళ పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇతర ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ బహిరంగ లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేపడుతున్నామని చెప్పారు. లక్కీ డ్రాలో పేరు వచ్చినంత మాత్రాన తుది కేటాయింపు జరిగినట్లు కాదని, అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భౌతిక పరిశీలన చేసి, పత్రాలు, అర్హతలను ధ్రువీకరించిన తర్వాతే తుది ఎంపిక, కేటాయింపు జరుగుతుందని వివరించారు. మొదటి విడత లక్కీ డ్రాలో ఇల్లు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో మరింత ప్రభుత్వ భూమిని సమీకరించి ఇళ్ల నిర్మాణాన్ని విస్తరించినప్పుడు మిగిలిన అర్హులను తదుపరి విడతల్లో పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

ఒకసారి లక్కీ డ్రాలో పేరు రాకపోయినంత మాత్రాన దరఖాస్తు ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. హౌసింగ్ బోర్డు ఎండీ పి.వి.గౌతమ్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి కేటాయించిన 480 ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 1,881 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తూ లక్కీ డ్రా నిర్వహిస్తున్నామని చెప్పారు.

లక్కీ డ్రాలో పేరు రాని అర్హులకు వెయిటింగ్ లిస్ట్ నిర్వహించి, భవిష్యత్‌లో మరిన్ని ఇళ్లు మంజూరైనప్పుడు అవకాశం కల్పిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు హౌసింగ్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, పీడీ హౌసింగ్ చంప్లా నాయక్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో పోలీసుల దౌర్జన్యంపై హరీశ్ ఆగ్రహం

**దశ, హైదరాబాద్:** సూర్యాపేటలో కూల్చివేతల సందర్భంగా పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజలపై పోలీసుల జులుం పెరిగిపోతోందని మండిపడ్డారు. ఇటీవల మహబూబాబాద్‌లో ఓ పోలీసు అధికారి పాలిటెక్నిక్ విద్యార్థి గొంతు పిసికి క్రూరంగా ప్రవర్తించారని, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలో తన కుమార్తెకు జరిగిన అవమానంపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తిని పోలీసులు బూటుకాళ్లతో తన్ని, మూత్రం తాగించారనే ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. తాజాగా సూర్యాపేటలో సోషల్ మీడియాలో పోస్టు పెట్టారనే కారణంతో కేసులు నమోదు చేయడం, కోదాడలో బడ్డీ కొట్టు తొలగింపు సందర్భంగా నిరసన తెలిపిన వారిపై సీఐ దౌర్జన్యంగా వ్యవహరించారని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణలో ఉన్నది ప్రభుత్వమా.. పోలీసు పాలనా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలపై పోలీసులతో జులుం, ప్రజలపై పోలీసులతో జులుం, ప్రశ్నిస్తే కేసులు, నిరసిస్తే అరెస్టులు, హక్కులు అడిగితే దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఇదేనా మీరు చెప్పుకున్న ప్రజాపాలన అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డీజీపీ చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## 94 వేల మంది ఓటర్లకు నోటీసులు

**మొదటి పేజీ తరువాయి**

బీఎల్‌వోల ద్వారా నోటీసులు జారీ చేశారు. ఆధారాలను పరిశీలించి వివరాలను సరిచేసేందుకు కళాభారతి ఆడిటోరియంలో 20 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రక్రియను ప్రారంభించారు. నోటీసులో పేర్కొన్న తేదీ, సమయంలో సంబంధిత వ్యక్తులు ఆధారాలతో హాజరుకావాలని అధికారులు సూచించారు. సెప్టెంబరు 22 వరకు ఆధారాల పరిశీలన కొనసాగించి తుది ఓటర్ల జాబితాను రూపొందించనున్నారు. గతంలో ఓటు హక్కు ఉండి ముసాయిదా జాబితాలో పేరు లేని వారు కూడా అభ్యంతరాలు, ఆధారాలతో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. కొత్తగా ఓటు హక్కు కోసం ఫారం6 ద్వారా పేరు నమోదు చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు. అయితే ఎన్యూమరేషన్ ఫారాల్లో వివరాలు సక్రమంగా నమోదు చేసి, ఆధారాలు సమర్పించినప్పటికీ నోటీసులు రావడంపై పలువురు ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుది జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడడంతో పాటు అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## కరిగిన విభేదాల మంచు?

**మొదటి పేజీ తరువాయి**

కట్టడం ద్వారా తాను పార్టీ నాయకత్వంతో విభేదాలకు దూరంగా ఉన్నాననే సంకేతం ఇచ్చారా? లేక ఇది కేవలం పండుగ సంప్రదాయమేనా? అన్న చర్చ జరుగుతోంది. మరోవైపు రేవంత్‌రెడ్డి కూడా ఎలాంటి అసౌకర్యానికి తావివ్వకుండా రాఖీ కట్టించుకోవడం ద్వారా పార్టీ అంతర్గత విభేదాలను బహిరంగ వివాదంగా మారకుండా చూడాలన్న వైఖరిని ప్రదర్శించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఒకే ఒక్క రాఖీ వేడుకతో రాజకీయ విభేదాలు పూర్తిగా సమసిపోయాయని నిర్ధారించలేమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే పరకాల నియోజకవర్గంలో ఉన్న రాజకీయ సమీకరణాలు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి విషయంలో సురేఖ వర్గం వైఖరి, సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పార్టీ తీసుకునే నిర్ణయం వంటి అంశాలు ఇంకా ముందున్నాయి. ప్రస్తుతం రాఖీ వేడుక ద్వారా ఇరు వర్గాల మధ్య పరిస్థితి సాధారణంగానే ఉందన్న సంకేతం బయటకు వెళ్లింది. అయితే ఈ సఖ్యత ఎంతకాలం కొనసాగుతుంది? రాబోయే రోజుల్లో పరకాల రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి? అన్నది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## రాఖీ పేరుతో ఆర్టీసీ స్పెషల్ బాదుడు

**మొదటి పేజీ తరువాయి**

సందర్భంగా '1:50' రూల్ పేరుతో అదనంగా రూ.100 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. మెట్రో డీలక్స్ స్పెషల్ బస్సులో హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు సుమారు రూ.400 వరకు చార్జీ వసూలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సుల్లోనూ అదనపు చార్జీల వసూళ్లు కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. మరోవైపు, కొన్ని స్పెషల్ బస్సుల్లో ప్రయాణికులు ఎక్కిన తర్వాత మార్గమధ్యలో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పండుగ సమయంలో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సి రావడంతో అదనపు చార్జీలు భరించాల్సి వస్తోందని వాపోతున్నారు.

## కాంగ్రెస్ 'వెయ్యి రోజుల పాలన'పై సమరశంఖం

**మొదటి పేజీ తరువాయి**

సదస్సులు నిర్వహించి మహిళలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయనున్నారు. రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల అంశాలను ప్రస్తావిస్తూ నిరసనలు చేపట్టనున్నారు. హామీలను అమలు చేయని ప్రభుత్వానికి వ్యతిరేకంగా వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 5న విద్యార్థులు, యువతతో నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించనున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ వంటి అంశాలపై పోరాటం చేయనున్నారు. ఆదిలాబాద్, సింగరేణి ప్రాంతాల్లో ప్రత్యేక నిరసన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లో నగర సమస్యలపై ఆటోలతో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. తాగునీరు, వీధిదీపాలు, ట్రాఫిక్, శాంతిభద్రతల అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయనున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పల్లెల్లో నెలకొన్న సమస్యలపై కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 7న ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యంపై వినతిపత్రాలు అందజేయనున్నారు.

## చెట్టుకు పర్యావరణ ప్రేమికుడి రాఖీ

**మొదటి పేజీ తరువాయి**

ఆయన.. రాఖీ పండుగ సందర్భంగా ఆ చెట్టుకు ఆవు పిడకతో తయారు చేసిన రాఖీ కట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ గుప్తా మాట్లాడుతూ.. చెట్లు ప్రాణవాయువును అందిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నాయని తెలిపారు. వాటిని కుటుంబ సభ్యుల్లా భావించి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. చెట్టుకు రాఖీ కట్టి సంరక్షణకు ప్రతిజ్ఞ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే తన ఉద్దేశమని చెప్పారు.

## ఆపరేషన్ తర్వాత నవజాత శిశువు మృతి

**నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో బంధువుల ఆందోళన**

**దశ, నల్గొండ:** నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువు మృతి చెందడం వివాదానికి దారితీసింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. డెలివరీ కోసం కంభంపాటి కవిత ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. తొలుత సాధారణ ప్రసవం అవుతుందని వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఒక రోజు తర్వాత శిశువు హార్ట్‌బీట్ సరిగా లేదని చెప్పి ఆపరేషన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ అనంతరం శిశువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శిశువు పరిస్థితి విషమంగా ఉందని చెప్పిన సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులే వైద్యం చేశారని బంధువులు ఆరోపించారు.